ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.


ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 291 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 28 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

### నక్సలైట్లతో కలసి వందలాది మంది బిజెపి వాళ్లను హతమార్చారు
### ఈటెల రాజేందర్ నక్సలైట్ కాదంటూ కితాబు
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



**కరీంనగర్, జనవరి 27 (ప్రభాత ఉదయం):** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని.. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని.. ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు.సోమవారం కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు.. నక్సలైట్‌గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే.. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన నేతలను హతమార్చారని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడానని..

..మిగతా 2లో



## ఆర్టీసీలో సమ్మె సైరన్

### హామీల అమలుకు జెఏసి సమ్మె నోటీసు

**హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, 2 పీఆర్‌సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. ' మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు

..మిగతా 2లో



## తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రికార్డు

### ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం
### 6,15,677 మంది అర్హులకు లబ్ది
### రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు రూ. 579 కోట్లు విడుదల

**హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో రికార్డు నెలకొల్పింది. ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటంతో పాటు.. అక్కడికక్కడే 6,15,677 మంది అర్హులకు లబ్ది కల్పించింది. అదే రోజున రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థికశాఖ రూ. 579 కోట్లు విడుదల చేసింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల్లో ఈ నిధులు జమ కావటంతో రాష్ట్రమంతటా ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగానే ప్రజా పాలనలో నాలుగు సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే లక్షలాది మంది ఈ సంక్షేమ పథకాలను అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయాన్ని అప్పటికప్పుడే వారి ఖాతాల్లో జమ చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసింది. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించింది. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా సభ్యులను నమోదు ప్రక్రియను పూర్తి చేసింది. మొదటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్ల రైతు భరోసా విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఒక్క రోజులోనే మొత్తం రూ.569 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది. మొదటి రోజునే 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి రైతు భరోసాను చెల్లించింది. 26వ తేదీన బ్యాంకులకు సెలవు దినం కావటంతో.. 27వ తేదీ ఉదయం నుంచి ఈ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మొదటి విడతగా రూ.6 వేలు చెల్లించింది. తొలి రోజున దాదాపు 18180 వేల వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఈ నగదు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకానికి తొలి రోజునే ఆర్థిక శాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది. గత పదేండ్లుగా

..మిగతా 2లో



## ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి..

**న్యూఢిల్లీ, జనవరి 27 (ప్రభాత ఉదయం):** బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వచ్చింది. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీ ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జనవరి 27ని ఉత్తరాఖండ్‌లో యూసీసీ డేగా జరుపుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం పొందింది. 2024, మార్చి 11 ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని ఈ ఏడాది జనవరిలో పూర్తిగా అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. దీని అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు. కాగా, పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.

## సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

### రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనాలు
### పథకాలపై నిలదీతలతో సమాధానాలు చెప్పలేకపోతున్నాం
### రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది
### వైరల్ అవుతున్న రాజగోపాల్‌రెడ్డి వీడియో



**మునుగోడు, జనవరి 27 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ ప్రభుత్వంపై అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు బంధును ఎగ్గొట్టామని, రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా కొంత నగదు తగ్గించామని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు) ప్రారంభోత్సవంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి

..మిగతా 2లో



## త్రివేణి సంగమంలో స్నానం చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా

**ప్రయాగ్‌రాజ్, జనవరి 27 (ప్రభాత ఉదయం):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న 'మహాకుంభ్'లో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా సోమవారం పాల్గొన్నారు. గంగా, యుమనా, సరస్వతీ నదులు సంగమించే త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. దీనికి ముందు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్న అమిత్‌షాకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాష్ట్ర మంత్రులు సాదర స్వాగతం పలికారు.అమిత్‌షా షెడ్యూల్ ప్రకారం, బడే హనుమాన్ జీ ఆలయాన్ని సందర్శిస్తారు. జునా అఖారాను సందర్శించి అఖారా మహరాజ్, ఇతర అఖారా సాధువులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారు. గురు శరణానంద్ జీ ఆశ్రమాన్ని సందర్శించి గురు శరణానంద్, గోవింద్ గిరి జీ మహరాజ్‌ను కలుసుకుంటారు. అనంతరం శృంగేరి, పూరి, ద్వాకరా శంకరాచార్యులను కలుసు కోవడంతో ఆయన పర్యటన ముగుస్తుంది. సాయంత్రం ప్రయాగ్‌రాజ్ నుంచి బయలుదేరి తిరిగి ఢిల్లీకి చేరుకుంటారు. మహాకుంభ కీలక రోజులు కావడంతో మహాకుంభ్ ఏరియాలో 'నో వెహికల్ జోన్' ప్రకటించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ వెహికల్ పాస్‌లు చెల్లవని మహాకుంభ్ మీడియా సెంటర్ ప్రకటించింది. సమీపంలోని పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే వాహన యజమానులు పార్కింగ్ చేసుకోవాలని సూచించింది. మహాకుంభ్ భద్రతా ఏర్పాట్ల కోసం 10,000కు పైగా స్థానిక పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. జనవరి 29న మౌని అమావాస్య (రెండవ సాహి స్నాన్), ఫిబ్రవరి 3 వసంత పంచమి (మూడవ సాహి స్నాన్), ఫిబ్రవరి 12న మాఘ పౌర్ణమి, ఫిబ్రవరి 26న మహా శివరాత్రి భక్తులు విశేషంగా హాజరుకానున్నారు.

## రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

### రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది ఖాతాల్లోకి నగదు
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



**హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం):** రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. 'కొత్త కార్డుల్లో 51,912 మందికి ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. తొలి రోజు మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. పాత రేషన్ కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు చేర్చారు. 501 గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభమైంది. మొదటి రోజు 20,336 మంది భూమిలేని కూలీలకు నిధులు విడుదలయ్యాయి' అని తెలిపారు. ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మల

..మిగతా 2లో



ప్రజావాణిలో దరకాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

## ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి: కలెక్టర్ సంతోష్

### అధికారులను ఆదేశించిన కలెక్టర్.. ప్రజావాణికి 55 ఫిర్యాదులు

గద్వాల: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధరూర్ ఎస్ఐగా కె.శ్రీహరి బాద్యతలు స్వీకరణ



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం) ధరూర్ మండలం రేవులపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా కె.శ్రీహరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీహరి ధరూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ కాగ ఇక్కడ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ షకూర్ జిల్లా వీఆర్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె. శ్రీహరి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, పీడిఎస్ బియ్యం అక్రమ తరలింపు, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

మొదటి పేజీ తరువాయి...

నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా..?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నమ్మిన సిద్దాంతం కోసం ప్రజాస్వామ్య బద్దంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో.. ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి 5 అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..? ఆయన భావజాలం ఏంటి..? బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం..? అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతూ 'తమకు రైతు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాన్ని తిరుడున్నారు. అంతా కేసీఆర్ పాలనే బాగుండేదని మెచ్చుకుంటున్నారు' అని అన్నారు. 'రైతుబంధును మధ్యలో ఒకసారి ఎగ్గొట్టినం. రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా, కొంత నగదును తగ్గించినం. అందుకే గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. అదే రూ.2 లక్షల రుణ మాఫీ అయినోల్లు మాత్రం జేబులో వేసుకొని సప్పుడు చేస్తలేరు. ఎన్ని అప్పులు చేసైనా పథకాలు అమలు చేస్తాం' అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సొంత పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్? ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రికార్డు

మొదటి పేజీ తరువాయి...



కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూసిన తెలంగాణ ప్రజల నిరీక్షణ ఫలించింది. ప్రజా ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ ప్రారంభించింది. వీటితో పాటు పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసింది. తొలి రోజున 531 గ్రామాల్లో 15414 కొత్త కార్డులు ఇచ్చింది. వీటిలో 51912 మంది కుటుంబ సభ్యులు లబ్ది పొందారు. వీటితో పాటు అదనపు సభ్యులను చేర్చాలంటూ 1.02 లక్షల మంది కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లకేళ్లుగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది కుటుంబ సభ్యులను నమోదు చేసింది. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. గూడు లేని నిరుపేదల కు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తొలి రోజునే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 72 వేల మంది పేదలకు ఇళ్ల పత్రాలను అందించింది.

## హెబ్రోన్ క్రిస్టియన్ సంఘంలో విభేదాలు సృష్టిస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలి: జల్లపల్లి నరేందర్

### రాజేశ్వర్ పద్ధతి మార్చుకోవాలని శంషాబాద్ క్రిస్టియన్ సంఘాల హెచ్చరిక



శంషాబాద్, జనవరి 27( ప్రభాత ఉదయం) హైదరాబాద్ నగరంలోని గోల్కొండ చౌరస్తాలో ఉన్న హెబ్రోన్ క్రిస్టియన్ కేంద్ర కార్యాలయంలో విభేదాలు సృష్టిస్తున్న ఎమ్మెల్సీ డి రాజేశ్వర్ ను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని టిపిసిసి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలపల్లి నరేందర్ డిమాండ్ చేశారు. ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు శవల జోసెఫ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్రిస్టియన్ సంస్థలు విభేదాలు సృష్టించి తమ పదం గడుపుకోవడానికి రాజేశ్వర్ చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండించారు. 1971లో భక్త సింగ్ దీనిని ఏర్పాటు చేశారని ప్రపంచవ్యాప్తంగా 20 వేల సంఘాలు ఇందులో ఉన్నాయని నరేందర్ తెలిపారు. గత కొన్ని రోజులుగా విభేదాలు కొనసాగుతుండడంతో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జైన్ సమక్షంలో రెండు వారగాల మధ్య ఒప్పందం కుదిరి కార్యక్రమాలు సజావుగా సాగుతూతాయని ఇండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు శవల జోసెఫ్ తెలిపారు. ఈ సమయంలో రాజేశ్వర్. మోహన్ బాబు మరి కొంతమంది వ్యక్తులు సంఘంలో చీలిక తీసుకురావడానికి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరు ప్రధాన క్రిస్టియన్ సంస్థల్లో హెబ్రోన్ ప్రధానమైనదని తెలిపారు. రాజేశ్వర్ తన పద్ధతి మార్చుకొని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌లకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో వివిధ చర్చల పాస్టర్లు సామ్యూల్ ప్రసాద్. థామస్. సోజ్జు మరండి. జెడి వెస్లీ. ఏ. కరుణాకర్. జాన్సన్. కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొబ్బిలి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

### మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు

### 10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న



హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం): తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్టులు, దర్యాప్తులు, విచారణల తర్వాత– ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

## ఘనంగా కొత్తకోట మండల మాజీ జెడ్‌పిటిసి జన్మదిన వేడుకలు



మాజీ జెడ్ పి టి సి డాక్టర్ పి జే బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు



డాక్టర్ పి జె బాబు దంపతులను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ నాయకులు మూలమల్ల భీంరెడ్డి

కొత్తకోట, జనవరి 27(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కాంగ్రెస్ పార్టీ నాయకుడు ,మాజీ జెడ్ పి టి సి డాక్టర్ పి జె బాబు 53వ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణం ఆర్ కె రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఘనంగా జన్మదిన వేడుకలు నాయకులు, అభిమానులు ఘనంగా డాక్టర్ పి జె బాబు ను సిడిసి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి,నాయకులు నరేందర్ రెడ్డి, కార్యకర్తలు, తదితరులు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి

### కానీ కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం

### కేంద్రం ఇచ్చే పథకాలకు ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు

### ప్రజలను మాయచేస్తున్న రేవంత్‌రెడ్డి : బండిసంజయ్

హైదరాబాద్, జనవరి 26 (ప్రభాత ఉదయం): మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చుయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు. పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.



## ఆర్టీసీలో సమ్మె సైరన్

మొదటి పేజీ తరువాయి...

రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారు.' అని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నప్పటికీ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని సంఘాల నేతలు మండిపడ్డారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ఆర్టీసీని ప్రయివేటుపరం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒక వేళ అదే కనుక జరిగితే.. వేలాది మంది ఆర్టీసీ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న ప్రతిపాదనను మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

## రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చున్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు.

# కండువా మార్చేది లేదు.. స్వతంత్రంగానే కొనసాగుతా

## టీయుడబ్ల్యూజే మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణ మాదిగ వెల్లడి

హైదారాబాద్, జనవరి 27(ప్రభాత ఉదయం): వర్గీకరణను జీర్ణించుకోలేక పోతున్న కొన్ని శక్తులు పథకం ప్రకారం తనపై రాజకీయ ముద్ర మోపి, లక్షలాది మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని, వర్గీకరణ అమలయ్యేంత వరకు తాను పోరాడుతూనే ఉంటానని, భవిష్యత్తులో కూడా ఏ రాజకీయ పార్టీ కండువా కప్పుకునేది లేదని, స్వతంత్రంగానే తన కార్యకలాపాలు కొనసాగిస్తానని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితీ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో సోమవారం 'లక్ష డప్పులు – వేల గొంతుల' కార్యక్రమంపై మీట్ ది ప్రెస్ నిర్వహించారు. టియుడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ మీట్ ది ప్రెస్ కు సమన్వయ కర్తగా వ్యవహారించగా ,టియుడబ్ల్యూజె ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు మందకృష్ణమాదిగ సమాధానమిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పును కూడా రాష్ట్రంలో గౌరవించక పోవడం విచారకరమన్నారు. ఎస్ సి వర్గికరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారన్నారు. వర్గీకరణను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి, దేశంలోనే తెలంగాణ మొట్టమొదలుగా అమలు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వర్గీకరణను అమలు చేయకుండా కాంగ్రెస్ మాల సామాజికవర్గం ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ను శాసిస్తున్న మాల సామాజిక వర్గం వత్తిళ్లకు తలొగ్గిన సిఎం రేవంత్ రెడ్డి వర్గీకరణను అమలు చేయడం లేదన్నారు. అందుకే హైదరాబాద్ లో ఫిబ్రవరి 7వ తేదీన 'లక్ష డప్పులు – వేల గొంతుల' సాంస్కృతిక కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. గత సంవత్సరం ఆగస్టు 1వ తేదీన సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, నాలుగు నెలల 26 రోజులు గడుస్తున్న రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయడం లేదని మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. అందరికంటే ముందే తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి వెనక్కి తగ్గారన్నారు.



మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న మంద కృష్ణమాదిగ

వర్గీకరణను చేయకుండానే ఉద్యోగ నోటీఫికేషన్లను జారీ చేస్తున్నారని, గ్రూప్ –1, 2, 3 అమలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. వర్గీకరణ జరగకుండానే ఇప్పటికే టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. ఈ మూడు మాటలకు రేవంత్ రెడ్డి కట్టుబడి ఉంటే తాము రోడ్డు ఎక్కాల్సిన అవసరం ఉండేదికాదన్నారు. అందుకే తాము సాంస్కృతిక, వాయిద్య ఉ ద్యమాన్ని చేపడుతున్నామని వివరించారు. వర్గీకరణపై సమాజం ఎటువైపు ఉండాలనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతుందన్నారు. సమాజమంతా వర్గీకరణ న్యాయమైందని, వర్గీకరణకే మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎస్సిల జాబితాలో 59 కూలాలు ఉంటే, 58 కులాలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వర్గీకరణ న్యాయమైనదే అనే విషయాన్ని అనేక కమిషన్లు తమ నివేదికలు సమర్పించాయన్నారు. తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా వర్గీకరణకు మద్దతు ఇచ్చాయని, దేశంలో మెజారిటీ పార్టీలు వర్గీకరణకు మద్దతు ఇస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బీఆర్ఎస్ , కాంగ్రెస్, టీడీపీ ఎంఎల్ఎలు మద్దతు ఇచ్చారన్నారు. జాతీయ స్థాయిలో జెడిఎస్, ఆప్, శివసేన, లాలు ప్రసాద్ యాదవ్ పార్టీలు మద్దతు ఇచ్చాయని తెలిపారు. వర్గీకరణపై 1999లో రాష్ట్రపతి అభిప్రాయం కోరిందని, అప్పటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ వర్గీకరణ అమలు చేయాలని స్పష్టం చేశారన్నారు. యుపిఏ ప్రభుత్వ హయంలో ఉషామేహ్రా కమిషన్ ఏర్పాటు చేశారని, ఉ మ్మడి రాష్ట్రంలో నాలుగేళ్లు వర్గీకరణ అమలు జరిగిందని వివరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం తీర్పు వచ్చిన 24 గంటల్లోనే రద్దు చేయించారని, 1999లో నోటీఫికేషన్ వర్గీకరణ అమలు చేశారని అన్నారు. ఇప్పుడు అనుకూలంగా తీర్పు వచ్చి నాలుగు నెలల 26 రోజులవుతున్నప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రద్దు అయిన చట్టాన్ని పునరుద్ధరించాలన్నారు.

వందల సంవత్సరాల క్రితమే డప్పులు ప్రజలకు సమాచారం అందవేశాయని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న మాదిగల గుండె చప్పుళ్లు, కోట్లాది మంది ఆకాంక్షలు, కోట్ల గొంతుకలతో ప్రపంచంలోనే మొట్టమొదటి సాంస్కృతిక వాయిద్య ఉద్యమానికి హైదరాబాద్ వేదిక కాబోతుందన్నారు. తాము గతంలో నిర్వహించిన అనేక పోరాట కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారని, రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక ఒక్క వ్యతిరేక ప్రకటన కూడా తాము ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ను శాసించే రెండు కుటుంబాలు రేవంత్ రెడ్డికి బ్రేకులు వేశాయని తెలిపారు. ఒక మల్లు, మరోకటి వెంకట స్వామి కుటుంబం మాత్రమే బ్రేకులు వేస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు కుటుంబాలకు కాంగ్రెస్ లో మంచి పలుకుబడి ఉందన్నారు. కాంగ్రెస్ జాతీయ నేత కె.సి.వేణుగోపాల్ వర్గీకరణను అమలు చేయవద్దు అని చెప్పడంతోనే రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదన్నారు. రాహుల్, మల్లికార్జున్ ఖర్గే తమ ఎన్నికల మేనిఫేస్టోలో వర్గీకరణకు అనుకూలమని ప్రకటించిన విషయాన్ని కృష్ణ మాదిగ గుర్తు చేశారు. గద్వాల్ సభలో రాహుల్ గాంధీ ప్రకటించారని, కాంగ్రెస్ జాతీయ కమిటీ ఆమోదం లేకుండానే ప్రకటించారా? అని ప్రశ్నించారు.

### లేఖరాసి ఊరుకున్నారమో..

పద్మ అవార్డులు తనకు ప్రకటించడం పట్ల సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారన్నారు. కానీ తాము పంపించిన జాబితాలో ఎవ్వరికీ రాలేదని అన్నారని మంద కృష్ణ అన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన గద్దర్, అందెశ్రీ, గొరటి వెంకన్న లాంటి వారి పేర్లతో జాబితా పంపించారని, కేవలం లేఖరాసి ఊరుకున్నారమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పద్మ అవార్డులు ఇవ్వాల్సిన వ్యక్తుల ప్రతిభ గురించి కేంద్రానికి చెప్పి ఇప్పించాల్సిందని చెప్పారు. మాదిగ రిజర్వేషన్ తో పాటు సామాజిక ఉద్యమాలు నడిపిన నేపథ్యం తనకు ఉందన్నారు. ఆరోగ్యశ్రీ, వికలాంగుల పెన్షన్ లాంటి సామాజిక మార్పులు తీసుకొచ్చిన చరిత్ర తనదని మందకృష్ణ మాదిగ అన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ మానసిక నిపుణులు కె. సోమశేఖర్ బాబు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం సుగుణా రెడ్డి

## ఒత్తిడికి గురికాకుండ ఎప్పటి పాఠ్యాంశాలు అప్పుడే చదువుకోవాలి

బుద్వేల్, జనవరి27 (ప్రభాత ఉదయం): ఒత్తిడికి గురికాకుండ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకుంటు ఉంటే 10వ తరగతి పరీక్షలను సులభంగా వ్రాయవచ్చని సీనియర్ మానసిక నిపుణులు కె. సోమశేఖర్ బాబు అన్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుగుణ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు ఒత్తిడి తట్టుకుని చదవడం ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో చెప్పే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకోవాలన్నారు. ఉదయాన్నే లేచి వ్యాయమం చేయాలన్నారు. ఆడుతు పాడుతూ చదువుకోవాలన్నారు. ఎప్పటి పాఠాలు అప్పుడు చదువుకుంటే మంచిదని, అన్ని ఒకే సారి చదువవద్దన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సెల్ ఫోన్ ల జోలికి పోకూడదన్నారు. వాట్సాప్, ఫేస్ బుక్ లకు దూరంగా ఉండాలన్నారు. సమయాన్ని వృదా చేసుకోవద్దని చదువుకు ఎక్కువ సమయం ఇవ్వాలన్నారు.



రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందచేస్తున్న పీ ఆర్ టీ యు ఉపాధ్యాయ సంఘం నాయకులు

## ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి: కె. గోవర్ధన్

బుద్వేల్, జనవరి27(ప్రభాత ఉదయం) : 204 సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత ఉపాధ్యాయులుగా ఉద్యోగాలలో చేరిన వారందరికి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) ను మాత్రమే వర్తింప చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్ టీ యు) రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు కె.గోవర్ధన్ కోరారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ మండల పీఆర్టీయు సం ఘం నాయకులతో కలసి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మీ ద్వారా ప్రభుత్వానికి మా డిమాండ్ ను తెలియజేయాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కె.గోవర్ధన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. దానికి బదులు కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ తీసుకురావడం జరిగిందని దీనికి ఉపాధ్యాయ లోకం ఎంత మాత్రం ఒప్పుకునేది లేదన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయు రాజేస్ ద్రనగర్ మండల శాఖ ఆధ్యక్షులు కడుమూరి మదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్ , గౌరవ అధ్యక్షులు మాణిక్యం రెడ్డి , మండల జిల్లా బాధ్యులు అల్లవల్లి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## వర్శిటీలలో బోధన సిబ్బంది పదవీ విరమణ వయస్సు పెంచొద్దు

### తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్

బుద్వేల్, జనవరి27(ప్రభాత ఉదయం) : విశ్వవిద్యాలయాలలో బోధన సిబ్బంది పదవీ విరమణ వయసు పెంచే ఆలోచన ను తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కాటం శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్శిటీలలో పనిచేసే బోధన సిబ్బంది పదవీ విరమణ వయస్సును 65 ఏళ్ల వరకు పెంచే విదంగా నిర్ణయం తీసుకుంటామని చేసిన ప్రకటనను మేం తీవ్రగా తప్పు పడుతున్నామన్నారు. యూనివర్శిటీలలో ఇప్పటికే పీజీ, పీహెచ్ డీ లు చేసి ఎంతో మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే, వారిని కాదని ఇప్పటికే ఉ ద్యోగాలలో పనిచేస్తున్న వారికి పదవీ విరమణ వయస్సును పెంచడం చాలా బాదాకరమన్నారు. కావాలంటే పదవీ విరమణ చేసిన వారిలో సబ్జెక్ట్ ఎక్స్ పర్ట్ లు ఉంటే వారిని ప్రభుత్వానికి సలహాదారులుగా పెట్టుకోవాలే తప్ప ఇలా సంవత్సరాల కొద్ది యూనివర్శిటీలలో పనిచేపిస్తు వారికి జీతాలు ఇవ్వడం దండుగ అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తుం దని, ఇలాంటి నిర్ణయాల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో సారి పునర్ ఆలోచించుకోవాలన్నారు. వీలైతే యూనివర్శిటీలలో ఖాళీలను ఏ విదంగా భర్తీ చేయాలి. ? వాటికి విధి విధానాలు ఏంటి, ఇప్పటి వరకు యూనివర్శిటీలలో ఎంత మంది తెలంగాణ ప్రాంత బిడ్డలు పీజీలు, పీహెచ్ డీ లు చేశారనే సమాచారాన్ని యూనివర్శిటీల ద్వారా తెప్పించుకుని చూడాలన్నారు. రాష్ట్రంలో దాదాపుగా 10 సంవత్సరాలుగా యూనివర్శిటీలలో నోటిఫికేషన్లు పడక పోపవడంతో పీజీ, పీహెచ్ డీ లు పూర్తి చేసుకున్న ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. నిరుద్యోగ యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించే విదంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ అంశంపై త్వరలోనే నిరుద్యోగులైన పీజీ, పీహెచ్డీ విద్యార్థులతో సమావేశం నిర్వహించి కార్యచరణను సిద్ధం చేయనున్నట్లు డాక్టర్ కాటం శ్రీధర్ తెలిపారు.





## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం)క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వంట భాస్కర్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకోని ఒంటెల పేటలో నిర్వహించిన ఒంటెలపేట ప్రిమిలియర్ లీగ్ క్రికెట్ టొర్నమెంట్ సీజన్–2 %ూ% సోమవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్ లో చిన్న ఛాలెంజర్ వర్సెస్ నవీన్ రెడ్డి టీంలు తలబడ్డాయి. ఈ మ్యాచులో విజేతగా చిన్న ఛాలెంజర్ నిలువగా.. నవీన్ రెడ్డి టీం రన్నర్ గా నిలిచింది. విజేత, రన్నర్ గా నిలిచిన జట్టులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించి గద్వాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకోరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్కూరు చిన్న, పరుశరాముడు, నవీన్ రెడ్డి, వహీద్ తదితరులు ఉన్నారు.



## నేడు కాటేదాన్, షాపూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/శంషాబాద్, జనవరి 27(ప్రభాత ఉదయం) శంషా బాద్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని శంకరాపురం విద్యుత్ ఫ్రీడమ్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు 220 కెవి హెచ్ టి లైన్ నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. శంకరాపురం, తొండు పల్లి, సుభాసన గ్రీన్, హమీదుల్లా నగర్, ఇందిరమ్మ కాలనీ, భగీరథ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

### కాటేదాన్ లో..

మైలార్ దేవుపల్లి విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని దుర్గా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు దుర్గా నగర్, దుర్గా హిల్స్, టీఎన్జీవోస్ కాలనీ ,అయ్యప్ప స్వామి టెంపుల్, మైలార్దేవ్ పల్లి కల్లు కాంపౌండ్ ,శాంతినగర్, గణేష్ నగర్, స్వప్న టాకీస్, లక్ష్మి గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మి గూడ గ్రామము, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్ జి కె, వాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుం దని కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## అయిజ తహసీల్దార్ జ్యోతికు ఘన సన్మానం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం) గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తు ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి సోమవారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ప్రశాంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అయిజ మండలంలో భూ సమస్యల పరిష్కారంలో ప్రతిభ కనబరిచి, ఉత్తమ సేవలందించిన అయిజ తహసీల్దార్ జ్యోతి ప్రశాంసాపత్రం అందుకోవడంతో మంగళవారం తహసీల్దార్ జ్యోతిని కార్యాలయ సిబ్బంది, ప్రజలు సన్మానించారు. ఈ సందర్భంగా అయిజ రేషన్ డీలర్ల సంఘం గద్వాల జిల్లా ఉపాధ్యక్షుడు డీలర్ రాములు ఆధ్వర్యంలో తహసీల్దార్ జ్యోతిని శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అయిజ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అయిజ మండల రేషన్ డీలర్లు నాగన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో సమావేశమైన మాదిగలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

## ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బుద్వేల్, జనవరి 27(ప్రభాత ఉదయం): ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల నియోజకవర్గం మాదిగ జేఏసీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మొయినాబాద్ మండలం లోని వివిధ రాజకీయ పార్టీల మాదిగ నాయకులు, జర్నలిస్ట్ లు హిమయత్ నగర్ లోని కంజర్ల మాల్‌లో ఆదివారం సమావేశం అయ్యారు . మండలం నుండి మాదిగలు,మాదిగ ఉపాకులాలు, వివిధ రాజకీయ పార్టీల లలో మాదిగ నాయకులు ప్రజాస్వామ్య వాదులు, యువలు,ప్రజా సంఘాలు, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ సంఘాలు, మహిళా సంఘాలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, చేవెళ్ళ నియెజక వార్గ ఇన్చార్జి క్యాసారం శంకర్ రావు మాదిగ, జిల్లా ఉపాధ్య క్షులు, నియెహకవర్గ ఇన్చార్జి కడిగాళ్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, మండల అధ్యక్షులు కొండిగారి మహేందర్ మాదిగ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యం.లక్మయ్య, శ్రీనివాస్, మండల అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పరి.శ్రీను, చిల్కూర్ ప్రేమ్ కుమార్, దేవేకుమార్,జి. దర్శన్, కె .భాస్కర్, ప్రదీప్, జీకరయ్య, షాబాద్ దర్శన్, సునీల్, ప్రభుదాస్, ప్రశాంత్, పవన్, చందు., ,మహేష్, అమ్డాపూర్ సునీల్, కనకమామిడి, రవి, దయాకర్,గణేష్, హరి, సందీప్, నెమిలిగారి రవి, దయాకర్, రామగల్ల.రాజు, చంద్రశేఖర్, కె. శ్రీధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు



రక్త దానం చేస్తున్న పోలీసు అదికారులు




రక్త దాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్

## రక్త దానం చేసిన పోలీస్ అకాడమీ అధికారులు

బుద్వేల్, జనవరి27(ప్రభాత ఉదయం) : వంశ పారంపర్య రక్త రుగ్మత అయిన తలసేమియతో బాధపడుతున్న వ్యక్తులకు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన శివరాంపల్లి లోని సర్దార్ వల్లబాయి పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 58 మంది అధికారులకు తలసేమియ సికిల్ సెల్ సోసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి ఆలీమ్ బేగ్ లు కృ తజ్ఞతలు తెలియజేశారు. తలసేమియ తో బాధపడుతున్న వారికి సోమవారం జాతీయ పోలీస్ అకాడమీలో ప్రత్యేకంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్, డాక్టర్ చంద్రశేఖర్ లు ప్రారంభించారు. తలసేమియ తో బాధపడుతున్న వారు శివరాంపల్లి రాఘవేంద్రకాలనీలో గల తలసేమియ సికిల్ సెల్ సొసైటీలో 15 రోజుల కొకసారి రక్తం ఎక్కించుకుంటారని. ఈ మధ్య కాలంలో రక్తం కొరత కారణంగా వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా జాతీయ పోలీస్ అకాడమీ అధికారులు ముందుకు వచ్చి రక్త దాన శిబిరం ఏర్పాటు చేయించడం సంతోషకరమన్నారు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు తలసేమియతో బాదపడుతున్న వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

## విశ్వవిద్యాలయాలలో బోధన సిబ్బంది పదవీ విరమణ వయస్సు పెంచుతామనడం పట్ల హర్షం

### టాసా అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్

బుద్వేల్, జనవరి27(ప్రభాత ఉదయం): విశ్వవిద్యాయలాలలో పనిచేస్తున్న బోధన సిబ్బంది పదవీ విరమణ వయస్సును పెంచడానికి ముఖ్యమంత్రి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలియజేయడం పట్ల తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం (టాసా) సతోషం వ్యక్తం చేస్తుందని టాసా అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ ప్రకటన విశ్వవిద్యాలయాలను పునర్నిర్మించే ప్రక్రియలో కీలకమెట్టుగా బావిస్తున్నానన్నారు. పదవీ విరమణ వయస్సు పెంచాలని గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికి పట్టించు కోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్శిటీ వ్యవస్థలను బాగుపరుస్తాం అని చెబుతుండటం సతోషకరమన్నారు. విశ్వవిద్యాలయాలకు వీసీ లను నియమించడమే కాదు నిధులు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం సంతోషకరమన్నారు. పెండింగ్ సమస్య అయిన ఫ్యాకల్టీ పదవీ విరమణ పెంపు కూడా సానుకూలంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పటం శుభ పరిణామం అన్నారు. అంతేకాకుండ త్వరలోనే విశ్వవిద్యాలయాలలో రిక్రూట్‌మెంట్ లను జరిపి పీజీ , పీహెచ్ డీ పట్టాదారులకు ఉద్యోగా లివ్వాలని మా సంఘం తరపున కోరుతున్నామన్నారు. రిక్రూట్మెంట్, పదవీ విరమణ అంశాలు రెండు కూడా విశ్వవిద్యాలయం వ్యవస్థను, బోధన స్థాయిని తప్పకుండ మెరుగుపరుస్తుందని బావిస్తున్నానన్నారు.





ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

## శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కొత్తకోట, జనవరి 27(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో భారీ ఎత్తున శ్రీకృష్ణ దేవాలయం నిర్మించారు. శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఫిబ్రవరి 13 నుండి 15 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఉడిపి శ్రీ పలి మారు మఠాధితులు శ్రీ శ్రీ శ్రీ విద్యా దేశ తీర్థ స్వామి వారు చేతుల మీదుగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆధ్యాత్మిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే సహించేది లేదు

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

కుత్బుల్లాపూర్, జనవరి 27 (ప్రభాత ఉదయం) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ ని కలిసి ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన నిరుపేదలకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అధికారులు చేసిన అవకతవకలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం కావున అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలన్నారు. కొందరు అధికారులు ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారని, అలా చేస్తే సహించబోమన్నారు. ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలు పూర్తిస్థాయిలో అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ రాము గౌడ్, యాదిరెడ్డి, ముత్యం రెడ్డి, జిమ్మీ దేవేందర్, మల్లేష్ యాదవ్, పరశురాములు గౌడ్, ధర్మారెడ్డి, బుచ్చిరెడ్డి, బండి శ్రీనివాస్ గౌడ్, మోతి శ్రీను, కృష్ణ యాదవ్, ప్రకాష్, సదానందం, కోటేశ్వరరావు, సురేష్, ధర్మారెడ్డి, శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.



## పదవి కాలం పూర్తయిన సందర్బంగా నియోజకవర్గ ఇంచార్జి, అధ్యక్షులు ని మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్, జనవరి 27 (ప్రభాత ఉదయం) పదవి కాలం 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, సురేష్ రెడ్డి, చిట్ల దివాకర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కో -ఆప్షన్ మెంబెర్ తలరి వీరేష్, శ్రీకాంత్ రెడ్డి, జగన్ యాదవ్, నాగరాజ్ యాదవ్, సాయి, ఆంజనేయులు వర్మ పాల్గొన్నారు.



## పదవితో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయాలి

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

కుత్బుల్లాపూర్, జనవరి 27(ప్రభాత ఉదయం) పార్టీలు పదవులతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సోమవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనకు పదవులు అడ్డుకావని, పదవులతో సంబంధం లేకుండా నాయకులు ప్రజల్లో తిరిగినప్పుడే రాజకీయంగా భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ లను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధికి ఎమ్మెల్యే వివేకానంద్ వెచ్చించిన నిధులు, చేసిన సంక్షేమం గురించి వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వివేకానంద్ సహాయ, సహకారాలతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, పదవులు ఉన్నాలేకున్నా ప్రజల కోసమే పని చేస్తామని అన్నారు. తమ రాజకీయ గురువు అయిన ఎమ్మెల్యే వివేకానంద్ కీ జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధనరాజ్ యాదవ్, రజిత రవికాంత్, రవి కిరణ్, గాజుల సుజాత, ఆగం రాజు, కాసాని సుధాకర్ ముదిరాజ్, పైడి మాధవి, రాఘవేంద్ర రావు, బొర్రా దేవి చందు ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలు సద్వినియోగం చేసుకోండి: ఎస్పీ శ్రీనివాసరావు

### ప్రజావాణిలో బాగంగా బాదితుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం)ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి ఫిర్యాదుల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేల పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాదితుల నుండి జిల్లా ఎస్పీ 7 ఫిర్యాదులను గద్వాల్ ,ఆలంపూర్,మరియు శాంతి నగర్ సీఐ ల సమక్షంలో స్వీకరించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుల పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో సీఐ లను అడిగి వాటిని పరిష్కరించేందుకు తగు సూచనలు చేసి వాటిని చట్టం ప్రకారం పరిష్కరించాలని సంబంధిత ఎస్సై లకు ఫోన్ చేసి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేల పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని, శాంతి భద్రతలు పరిరక్షిస్తూనే ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ కమ్యూనిటీ, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యేల కృషి చెయ్యడం జరుగుతుందని అన్నారు. ప్రజా సమస్యల పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా నేరుగా పిర్యాదులు స్వీకరించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అన్నారు. భూ వివాదాలకు సంబంధించి -04 పిర్యాదులు, ప్లాట్ ఆక్రమణకు సంబందించి -01, ఇతర అంశాలకు సంబంధించి -02 పిర్యాదులు అందినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

# తిక్క......డవా అంటూ ఓ మండలాధికారి బూతు పురాణం

### విధులకు హాజరు కాని అధికారిని ప్రశ్నించినందుకు సహనం కోల్పోయిన అధికారి బూతు పురాణంతో మండిపాటు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 27 (ప్రభాత ఉదయం) ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు మేము ఎలా అనర్హులం అని నిలదీసిన ప్రజలపై ఓ మండల అధికారి బూతు పురాణం లంకించుకున్న ఆడియో క్లిప్పింగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. ఆయన వాడిన పదజలాన్ని యధాతధంగా ఎవరూ రాయలేరు. ఒకవేళ రాద్దామనుకున్నా సాధ్యం కాదు. ఎందుకంటే అంత ఘాటుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి మరి. గద్వాల జిల్లాలోని ఓ మండల పరిషత్ ఉన్నత అధికారిగా మండలంలో సౌమ్యుడిగా పేరుంది. కానీ ప్రస్తుతం విడుదలైన ఆడియో క్లిప్ ఆ అభిప్రాయాన్ని మార్చేసింది. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అనర్హులకు ప్రకటించారని జిల్లాలోని ఓ మండలానికి చెందిన ప్రజలు ఆ మండలాధికారిని చరవాణిలో సంప్రదించారు. ప్రభుత్వం అందించిన అన్ని సంక్షేమ పథకాలకు నేను అర్హుడు అయినప్పటికి కాని అధికారులు సర్వేలో అనర్హులుగా ఎలా ప్రకటించారని ఆ ఆధికారి దృష్టికి తీసుకెళ్లారు. సార్ మీరు 12 అయిన ఇంకా ఆపీస్ కు ఎందుకు రావడంలేదని గట్టిగా నిలదీయడంతో... సహనం కోల్పోయిన ఆ అధికారి తిక్క....లా మాట్లాడొద్దంటూ బూతు పురాణంతో తిట్టాడు. ప్రజలకు సమాదానం ఇవ్వాల్సిన మండలాధికారి ఎవరు రాయలేని ఆ బూతు పదం ఆడియో క్లిప్ ఇప్పుడు వైరల్ గా మారింది. ప్రస్తుతం ఆ ఆడియో మండలంలో హల్ చల్ చేస్తుంది. సమయం 12 అయిన మండలాధికారి ఆపీస్‌కు ఎందుకు రావడంలేదని ప్రశ్నిస్తే ఇలా బూతు పురాణంతో తిడుతారా అంటూ వారు నిలదీశారు. గతంలో ఆ అధికారిపై అనేక ఆరోపణలున్నాయి. విధుల పట్ల నిర్లక్ష్యం.. ఇరెగ్యులర్ గా ఆఫీస్ కు రావడం వంటివి ఆ అధికారి పై ఫిర్యాదులు చేసిన దాఖలున్నాయి. ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు సహనం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడటం సమంజషమేనా అని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

# సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

**పీఆర్టీయు టీఎస్ మాజీ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి**



తహసిల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేస్తున్న పి.ఆర్.టి.యు నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం) ఏకీకృత పెన్షన్ విధానాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని పీఆర్టీయు టీఎస్ మాజీ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి అన్నారు. పీఆర్టీయు టీఎస్ రాష్ట్ర శాఖ ఆదేశానుసారం కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్స్ స్కీం ను అమలు చేస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటర్ పెన్షన్స్ స్కీం విధానము నుండి ఏకీకృత పెన్షన్స్ స్కీంలో చేర్చిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (%ూూా%) అమలు చేయాలని కోరుతూ సోమవారం గద్వాల తహసీల్దార్ మల్లికార్జునకు టీఆర్టీయు టీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాంట్రిబ్యూషన్ పెన్షన్స్ స్కీం బదులుగా తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్స్ స్కీంను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ సామాజిక , ఆర్థిక భద్రత కల్పించే ఓల్డ్ పెన్షన్ స్కీంను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి, గద్వాల గద్వాల మండల శాఖ అధ్యక్షులు ఈదన్న ,ప్రధాన కార్యదర్శి బి. కృష్ణ పాల్గొన్నారు.

# సేవ పతకాన్ని అందుకున్న అలంపూర్ సీఐ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న అలంపూర్ సీఐ రవి బాబు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న శాంతినగర్ సీఐ టాటా బాబు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం)2024 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట , అతి ఉత్కృష్ట సేవ పతకాలలో జిల్లా నుండి ఎంపిక అయిన 9 మంది అధికారులలో 8 మంది అధికారులకు ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు సేవ పతకాలను అందజేయగా సోమవారం ఆలంపూర్ సీఐ రవి బాబు కు జిల్లా ఎస్పీ తన ఛాంబర్ లో సేవ పతకాన్ని అందజేశారు. అలాగే 2024 సంవత్సరానికి గాని శాంతి నగర్ సీఐ టాటా బాబు, ఆలంపూర్ సీఐ జి. రవి బాబు లు అందించిన ఉత్తమ సేవలకు గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రశంస పత్రాలను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పి వై. మోగిలయ్యా పాల్గొన్నారు.



నియోజకవర్గ విద్యుత్ సమస్యలపై టీజీఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే జిఎంఆర్

## లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు త్వరలో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు: సిఎండి ముషారఫ్

దేవరకద్ర, జనవరి 27(ప్రభాత ఉదయం) నియోజక వర్గంలో విద్యుత్ సమస్యలపై టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జిఎంఆర్ సోమవారం కలిసి వినతిపత్రం అందజేసి చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన మూడు డివిజన్స్ పరిధిలో కొత్త కాలనీలకు సంబంధించిన ఎల్ టి లైనులకు, అగ్రికల్చర్లకు సంబంధించి లైన్లకు, హెచ్ టి లైన్లకు దేవరకద్ర నియోజకవర్గ విద్యుత్ అవసరాల కోసం కొత్తగా ట్రాన్స్ఫార్మర్లు కేటాయించాలని కోరారు, కొత్తగా నియోజకవర్గంలో ఎనిమిది 33/11 కె.వి సబ్ స్టేషన్ లను మంజూరు చేసి నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, అదేవిధంగా జడ్చర్ల సబ్ డివిజన్ పరిధిలోని భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట్ మండలాలను తొలగించి, ఈ మూడు మండలాలకు ఒక సబ్ డివిజన్ కొత్తగా ఏర్పాటు చేయాలని, అదేవిధంగా నియోజకవర్గంలో ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సి ఎం డి ముషారఫ్ ను కోరారు. ఈ సందర్భంగా సీఎం డి ముషారఫ్ సానుకూలంగా స్పందించి, వారం రోజుల్లోగా 100 ట్రాన్స్ఫార్మర్లను నియోజకవర్గానికి పంపిస్తామన్నారు. లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు త్వరలో కొత్త సబ్ స్టేషన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో వ్యభిచార గృహంపై సోమవారం గద్వాల టౌన్ పోలీసులు దాడులు చేశారు. గద్వాలలోని శ్రీబసవన్న చౌరస్తా సమీపంలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు అకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈదాడులో నిర్వాహకుడితో పాటు, ఇద్దరు మహిళలు, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు. కడపకు చెందిన ఓ వ్యక్తి గద్వాలలో ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు లో తేలింది. వారి వద్ద నుంచి 7సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608